ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డిని చేర్చుకోవద్దు

- కాంగ్రెస్‌లో నిరసనల హోరు
- వ్యతిరేకిస్తున్న జడ్పీచైర్‌పర్సన్ వర్గం
- టవరెక్కి కాంగ్రెస్ కార్యకర్త హల్‌చల్
- పెట్రోల్ పోసుకున్న మరో ముగ్గురు
- అడ్డుకున్న పోలీసులు, నాయకులు

ఎమ్మెల్యే బండ్లను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని గద్వాలలో రోడ్డుపై బైఠాయించిన అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు, పక్కన ఒంటిపై పెట్రోల్ పోసుకున్న కార్యకర్తను అడ్డుకుంటున్న నాయకులు

గద్వాల అర్బన్/ధరూరు/కేటీదొడ్డి, జూలై 4 : గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఈనెల 6 లేదా.. 9వ తేదీన కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్న ప్రచారం సామాజిక మాధ్యమాలలో జోరందుకున్నది. ఎమ్మెల్యే పార్టీ మారొద్దని జడ్పీచైర్‌పర్సన్ సరిత వర్గం నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. గురువారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా చేపట్టారు. గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం అయింది. ఎమ్మెల్యేను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవద్దని కాంగ్రెస్ కార్యకర్త ప్రసాద్ సెల్ టవర్‌పైకి ఎక్కి నిరసన తెలిపాడు. ఆయన్ను పార్టీలోకి తీసుకుంటే టవర్ పైనుంచి దూకేస్తానని హెచ్చరించాడు. ఏఎస్సీ గుణశేఖర్, డీఎస్పీ సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని అతడికి నచ్చజెప్పారు. కొద్దిసేపటి తర్వాత కిందికిరాగా దవాఖానకు తరలించారు. అనంతపురానికి చెందిన రహీం, గద్వాలకు చెందిన అనిల్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించారు. పోలీసులు, అక్కడున్న నాయకులు అప్రమత్తమై అడ్డుకున్నారు. ధరూర్‌లోనూ డీఆర్ శ్రీధర్ ఆధ్వర్యంలో మాజీ పీఏసీసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆంజనేయులు, సూరితోపాటు పలువురు కార్యకర్తలు నిరసన చేపట్టారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. కేటీదొడ్డిలోనూ నాయకులు ఆనంద్‌గౌడ్, శ్రీను, విష్ణు, గోవర్ధన్, వేషాద్రి, మునెప్ప నాయక్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. గద్వాల-రాయిచూర్ రహదారిపై హస్తం పార్టీ కార్యకర్తలు బైఠాయించారు. ఓ కార్యకర్త ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. అక్కడున్న వారు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కృష్ణమోహన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దని సీఎం రేవంత్‌ను వేడుకున్నారు. సరితమ్మ నాయకత్వంలో కాంగ్రెస్‌కు గద్వాలలో పూర్వ వైభవం తీసుకొస్తామని చెప్పారు. ఆయన్ను చేర్చుకుంటే అసలైన కాంగ్రెస్ వాదులకు అన్యాయం జరుగుతుందని వాపోయారు.

జగిత్యాలలో ఉండనియ్యరా?

- మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహం

అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, జూలై 4 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోత్రాలకాలనీ 8వ వార్డులో గురువారం జరిగిన పోచమ్మ, దుర్గమ్మ బోనాల పండుగలో ఫ్లెక్సీల రగడ నెలకొన్నది. బోనాల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీల్లో మున్సిపాలిటీలో పనిచేసే వారి ఫొటో ఉండటంతో వార్డు కౌన్సిలర్, నాయకులు మున్సిపల్ అధికారులకు ఫోన్ చేసి ఫ్లెక్సీలో మున్సిపాలిటీలో పనిచేసే వారి ఫొటో ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. ఉత్సవాలకు హాజరై తిరిగి వెళ్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి.. మున్సిపల్ అధికారులు ఆ ఫ్లెక్సీని తొలగిస్తున్న సిబ్బందిని చూసి, ఎందుకు తొలగిస్తున్నారు? అని అడిగారు. మున్సిపాలిటీలో పనిచేసే వారి ఫొటో ఉండటంతో ఫ్లెక్సీ తొలగిస్తున్నామని చెప్పడంతో జీవన్‌రెడ్డి మున్సిపల్ అధికారికి ఫోన్ చేసి 'జగిత్యాలలో ఉండనిస్తారా? ఊరి నుంచి వెళ్లగొడతారా? అంటూ మండిపడ్డారు. కలెక్టర్‌కు, మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌కు జీవన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. స్థానిక నాయకుల మధ్య రగడ ఎటువైపు దారితీస్తుందోనని చర్చించుకుంటున్నారు.

క్యాబినెట్ విస్తరణపై ఏఐసీసీనే అడగండి

- ఎన్నికల వరకే రాజకీయాలు.. కేంద్రంతో సత్సంబంధాలు
- ఈవీఎం ట్యాంపరింగ్ చేయొచ్చు
- డిప్యూటీ సీఎం భట్టితో కలిసి ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రెస్‌మీట్

ఢిల్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎంపీలు బలరాంనాయక్, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): పీసీసీ అధ్యక్షుడి ఎంపిక, మంత్రివర్గ విస్తరణపై తమ మధ్య ఏకాభిప్రాయమే ఉన్నదని, మరి ఎందుకు ఆలస్యం అవుతున్నదో ఏఐసీసీ పెద్దలనే అడగాలని పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఢిల్లీలో గురువారం ఆయన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. క్యాబినెట్ విస్తరణపై తాను ఎప్పుడూ తేదీలు చెప్పలేదని అన్నారు. మీడియా వాళ్లే మంత్రివర్గ విస్తరణ చేసి, శాఖలు కూడా పంచి, మళ్లీ వాళ్లే వాయిదా వేశారని పేర్కొన్నారు. ఈ నెల 7న తన పీసీసీ అధ్యక్ష పదవీ కాలం ముగుస్తున్నదని, అందుకే కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేయాలని ఏఐసీసీ పెద్దలను కోరారని చెప్పారు. ఇప్పుడు ఈ అంశం ఏఐసీసీ కోర్టులో ఉన్నదని తెలిపారు.

2029 వరకూ అధికారంలో మేమే

తెలంగాణలో 2029 వరకూ కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. తెలంగాణలో పదేండ్లకోసారి, ఆంధ్రలో ఐదేండ్లకోసారి అధికార మార్పిడి జరిగే ట్రెండ్ కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ఈ లెక్కన తామే పదేండ్లు అధికారంలో ఉంటామని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ ఎక్కడా లేదని, టార్చ్‌లైట్ వేసి వెతికినా కనిపించదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌దంతా గత చరిత్ర అని, భవిష్యత్ లేదని పేర్కొన్నారు. బీజేపీ నేతలు ఫిరాయింపుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు. 11 రాష్ట్రాల్లో బీజేపీ ఎంతోమంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకొని అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ప్రభుత్వాలు ఎలా ఏర్పడ్డాయో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పట్ల బీజేపీ నేతలకు, ఈటల రాజేందర్‌కు సానుభూతి ఎందుకో చెప్పాలని పేర్కొన్నారు. ఈటల ఇప్పటికీ కేసీఆర్‌నే తన నాయకుడిగా భావిస్తున్నారని ఎద్దేవా చేశారు.

ఎన్నికల వరకే రాజకీయాలు

రాజకీయాలు ఎన్నికల వరకేనని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ తర్వాత పార్టీలకు అతీతంగా అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేయాలని, రాష్ట్ర ప్రయోజనాల కోసం సత్సంబంధాలు కొనసాగించాలనే ఉద్దేశంతోనే కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు. తెలంగాణ ఎదుర్కొంటున్న పలు సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లగా, కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి వెళ్లి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాను కోరినట్టు వివరించారు.

ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయొచ్చు

ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయొచ్చని సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పోలింగ్ రోజున రిజర్వులో ఉంచే 15% ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వీటిని మారిస్తే ఎవరికీ తెలిసే అవకాశం ఉండదని వ్యాఖ్యానించారు.

ఐదు విలీన గ్రామాలను తిరిగి కలపాలని కోరాం

భద్రాచలంమండలంలోని ఐదు విలీన గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని ప్రధానికి విజ్ఞప్తి చేసినట్టు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ కోసం ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. సాధ్యమైనంత వరకు అన్ని అంశాలను పరిష్కరిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని వెల్లడించారు.విభజనచట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరామని తెలిపారు. తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించుకోవడానికి ఏపీ సీఎం చంద్రబాబుతో సమావేశం అవుతున్న విషయాన్ని అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లినట్టు వెల్లడించారు. 'మీ వంతుగా ప్రయత్నం చేయండి, అప్పటికీ పరిష్కారం కాకుంటే తాము చొరవ తీసుకుంటాం' అని అమిత్‌షా చెప్పారని రేవంత్‌రెడ్డి వివరించారు.

సీఎం కేరాఫ్ ఢిల్లీ!

- రాష్ట్ర రాజధానిలో తక్కువ.. దేశ రాజధానిలోనే ఎక్కువ
- గత నెల రోజుల్లో 9 రోజులు ఢిల్లీలోనే
- వచ్చే వారం కూడా వెళ్లే అవకాశం
- విస్మయం వ్యక్తం చేస్తున్న ప్రజలు

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి అంటే రాష్ట్ర రాజధానిలో ఉంటూ పాలన సాగించాలి. సీఎం రేవంత్‌రెడ్డి అందుకు భిన్నంగా దేశ రాజధానిలో ఎక్కువగా కనిపిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'సీఎం కేరాఫ్ ఢిల్లీ'గా మారారని, ముఖ్యమంత్రిని హైదరాబాద్‌లో కన్నా ఢిల్లీలో అయితే సులభంగా కలువొచ్చని రాజకీయ వర్గాల్లో జోకులు పేలుతున్నాయి. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఈ నెల 7వ తేదీకి ఏడు నెలలు పూర్తి కావొస్తున్నది.ఇప్పటివరకు ఆయన 17 సార్లు ఢిల్లీకి వెళ్లి వచ్చారు.సగటున నెలకు 2,3 సార్లు ఢిల్లీ వెళుతున్నట్టు చెప్తున్నారు. కేంద్రప్రభుత్వ పెద్దలను కలవటం తప్పేమీ కాదని, ప్రతిసారి కాంగ్రెస్ పెద్దలను కలిసి చర్చలు జరుపుతున్నారని గుర్తుచేస్తున్నారు. ఎటూ తెగని చర్చలతో కాలం వృథా అవుతున్నదని విమర్శిస్తున్నారు. గత నెల రోజుల్లో ఇది పరాకాష్టకు చేరిందని అంటున్నారు. జూన్ 4 – జూలై 4 మధ్య మూడు సార్లు ఢిల్లీకి వెళ్లారని చెప్తున్నారు. మొదట జూన్ 8, 9 తేదీల్లో ఢిల్లీకి వెళ్లారు. సీడబ్ల్యూసీ సమావేశాల్లో పాల్గొన్నారు. తర్వాత జూన్ 24న ఢిల్లీకి వెళ్లి ఐదు రోజులపాటు అక్కడే ఉన్నారు. ముగ్గురు కేంద్ర మంత్రులను కలిసినా.. అసలు చర్చంతా మంత్రివర్గ విస్తరణ, కొత్త పీసీసీ అధ్యక్షుడి నియామకం, నామినేటెడ్ పోస్టులపైనే జరిగింది. డిప్యూటీ సీఎం, ఏడుగురు మంత్రులు.. ఢిల్లీలోనే కనిపించారు. ఐదు రోజులు హైడ్రామా కొనసాగినా ఫలితం తేలలేదు. తాజాగా జూలై 3, 4 తేదీల్లో ఢిల్లీలో పర్యటించారు. 3న పూర్తిగా పదవుల పంపకంపై పార్టీ చర్చలకే పరిమితం కాగా, 4న ప్రధాని మోదీ, హోంమంత్రిని కలిశారు. మొత్తంగా 9 రోజులపాటు ఢిల్లీలోనే గడిపారని చెప్తున్నారు. అంటే మూడింట ఒక వంతు కాలం ఢిల్లీలోనే గడుపుతున్నారని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ పరిణామాలపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సగటున వారానికి రెండు రోజులు ఢిల్లీలో ఉండటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ఎన్నికల హామీలను అమలు చేస్తున్నాం

- శ్రీలంక జర్నలిస్టులతో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అయిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శ్రీలంకకు చెందిన మీడియా ప్రతినిధుల బృందం గురువారం సచివాలయంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. తెలంగాణకు ఘనమైన సాంస్కృతిక చరిత్ర, సహజ వనరులు ఉన్నాయని తెలిపారు.ఎమర్జింగ్ టెక్నాలజీ రంగంలోనూ రాష్ట్రం ముందంజలో ఉన్నట్టు వెల్లడించారు. అనంతరం శ్రీలంక జర్నలిస్టులు మాట్లాడుతూ.. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మీడియా మేనేజ్‌మెంట్‌పై రెండు వారాల శిక్షణలో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చినట్టు తెలిపారు. శిక్షణతో తాము ఎంతో ప్రయోజనం పొందినట్లు వెల్లడించారు. సమావేశంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు, అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు సీతక్క, సురేఖ తదితరులు

మంత్రులు తలోదారి!

- హైదరాబాద్‌లో పొంగులేటి సమీక్ష
- వరంగల్‌లో దుద్దిళ్ల, జనగామలో కోమటిరెడ్డి కార్యక్రమాలు
- సమీక్షకు పశ్చిమ ఎమ్మెల్యే గైర్హాజరు

వరంగల్, జూలై 4 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అయోమయంగా సాగుతున్నది. మంత్రుల గజిబిజి కార్యక్రమాలతో ఎమ్మెల్యేలు, అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పనులపై ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యం లో గురువారం హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. మంత్రులు సురేఖ, సీతక్క, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, సీఎం సలహాదారు నరేందర్‌రెడ్డి, మేయర్ సుధారాణి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీహరి, ప్రకాశ్‌రెడ్డి, మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఈ సమీక్షకు గైర్హాజరయ్యారు. మంత్రి పొంగులేటి సమీక్ష సమయంలోనే వరంగల్‌లోని ఎల్బీ కాలేజీ 50వ వార్షికోత్సవానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరయ్యారు. దీంతో వరంగల్ పశ్చిమ ఎమ్మెలే రాజేందర్‌రెడ్డి సమీక్షకు హాజరు కాలేదు. గ్రేటర్ వరంగల్‌లోని ఎక్కువ ప్రాంతం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోనే ఉంటుంది. తాను హాజరుకాలేని పరిస్థితిలో ఉన్నప్పుడు సమీక్ష నిర్వహించడంపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే అసంతృప్తితో ఉన్నారు. మరోవైపు మంత్రి పొంగులేటి సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న సమయంలోనే జనగామలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణకు మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. మంత్రులు ఎవరికి వారుగా ఒకే ఉమ్మడి జిల్లాలో పాల్గొనడంపై ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. మంత్రుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల తాము ఇబ్బంది పడుతున్నామని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సారూ.. పెండింగ్ బిల్లులు ఏవీ?

- ఆరు నెలల గౌరవ వేతన బకాయిలు ఇవ్వండి
- సీఎం రేవంత్‌కి ఎంపీటీసీ లేఖ

భీమ్‌గల్, జూలై 4: పెండింగ్ బిల్లులతోపాటు ఆరు నెలల గౌరవ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం మెండోరా ఎంపీటీసీ సభ్యురాలు లావణ్య సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. గురువారంతో తమ పదవీకాలం ముగుస్తున్న తరుణంలో తమకు రావాల్సిన గౌరవ వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు లేఖను సోషల్ మీడియాలో సీఎం రేవంత్‌రెడ్డి అకౌంట్లకు ట్యాగ్ చేశారు. గ్రామాభివృద్ధి కోసం అప్పులు తెచ్చి పనులు చేశామని పేర్కొన్నారు. వెంటనే బిల్లులను మంజూరు చేసి, ఎంపీటీసీలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఎంపీటీసీలు గ్రామంలో కేవలం ఉత్సవ విగ్రహాలుగా మారారని, గ్రామపంచాయతీలో ఎంపీటీసీలు కూర్చోవడానికి కనీసం కుర్చీ కూడా లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామాల అభివృద్ధి కోసం వచ్చే నిధుల్లో ఎంపీటీసీలను కూడా భాగస్వామ్యం చేయాలని కోరారు.

బొగ్గు బ్లాకులు సింగరేణికే ఇవ్వాలి

- ఐటీఐఆర్‌ను పునరుద్ధరించాలి
- 25 లక్షల ఇండ్లు ఇవ్వండి
- 'విభజన' హామీలు నెరవేర్చాలి
- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): సింగరేణి బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని, శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను వేలం జాబితా నుంచి తొలగించాలని ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.ఢిల్లీలో ఉన్న సీఎం గురువారం డిప్యూటీ సీఎం భట్టితో కలిసి ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. ప్రధానితో పలు అంశాలపై చర్చించి, వినతిపత్రం సమర్పించారు.గనులు,ఖనిజాభివృద్ధి నియంత్రణ చట్టంలోని (ఎంఎండీఆర్) సెక్షన్ 11ఏ/17 (ఏ) (2) ప్రకారం వేలం జాబితా నుంచి శ్రావణపల్లి గనిని తొలగించాలని సీఎం కోరారు. అదే సెక్షన్ ప్రకారం కోయగూడెం, సత్తుపల్లి బ్లాక్ 3 గనులనూ సింగరేణికే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌కు ఐటీఐఆర్ పునరుద్ధరించాలని కోరారు. హైదరాబాద్‌కు ఐఐఎం మంజూరు చేయాలని కోరారు. హెచ్‌సీయూలో భూమి అందుబాటులో ఉన్నదని, ప్రత్యామ్నాయంగా భూ కేటాయింపునకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని వివరించారు. కాజీపేటలో పీరియాడికల్ ఓవరాయిలింగ్ వర్క్‌షాప్ కాకుండా, హామీ మేరకు కోచ్ ఫ్యాక్టరీయే మంజూరు చేయాలని విన్నవించారు.బయ్యారంలో స్టీల్‌ప్లాంట్‌ను మంజూరు చేయాలని, ఇండియా సెమీకండక్టర్ మిషన్‌లో తెలంగాణను చేర్చాలని కోరారు. పీఎంఏవై కింద తెలంగాణకు 25 లక్షల ఇండ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్జీఎఫ్ కింద రూ.1,800 కోట్లు బకాయిలు విడుదల చేయాలని, హైదరాబాద్-కరీంనగర్ రహదారి, హైదరాబాద్-నాగ్‌పూర్ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణశాఖ భూములను బదిలీ చేయాలని కోరారు. ప్రత్యామ్నాయంగా రావిరాలలో రీసెర్చ్ సెంటర్ ఇమరాత్ కి లీజుకు ఇచ్చిన 2,462 ఎకరాల భూములను పూర్తిగా కేంద్రానికి అప్పగిస్తామని చెప్పారు. హైదరాబాద్ ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం (సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు) జాతీయ రహదారి నిర్మాణ టెండర్లు తొందరగా చేపట్టాలని కోరారు. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా గుర్తిస్తూ, 13 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయండి' అని ప్రధానిని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

29 ఐపీఎస్ పోస్టులివ్వాలి

తెలంగాణకు 61 ఐపీఎస్ పోస్టులు కేటాయించారని,అదనంగా మరో 29 ఐపీఎస్ పోస్టులు కేటాయించాలని హోంమంత్రి అమిత్‌షాను సీఎం రేవంత్ కోరారు. తెలంగాణ ఐపీఎస్ క్యాడర్‌పై 2016 లో సమీక్ష జరిగిందని, మరోసారి చేయాలని విన్నవించారు. రాష్ట్రస్థాయి అత్యున్నత నిఘా విభాగాలైన తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధునీకరణకు 178 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సెక్యూరిటీ ఫోర్స్ క్యాంపులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొండవాయి, ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాకలో సీఆర్పీఎఫ్ జేటీఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో సీపీఐ మావోయిస్టు కమిటీ ఒక ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేసి విస్తరణకు ప్రయత్నిస్తున్నదని అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారు. ఎస్పీవోలకు చెల్లించాల్సిన నిధుల్లో కేంద్రం వాటా 60 శాతం నాలుగేండ్ల నుంచి పెండింగ్‌లో ఉందని, రూ.18.31 కోట్లు విడుదల చేయాలని కోరారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో మాజీ సైనికులు, మాజీ పోలీసులు అందుబాటులో లేరని, 1065 మందిని ఎస్పీవోల్లో చేర్చుకోవడానికి నిబంధనలు సడలించాలని కోరారు.

కోదండరెడ్డివి సిగ్గుమాలిన మాటలు

- ఆత్మహత్య చేసుకున్న రైతుపై తప్పుడు ప్రచారం
- నిందితుడు భట్టి అనుచరుడనే అరెస్ట్ చేస్తలేరు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఫైర్

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ) : ఖమ్మం జిల్లా చింతకానిలో ఆత్మహత్య చేసుకున్న రైతు గురించి కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు కోదండరెడ్డి సిగ్గుమాలిన మాటలు మాట్లాడారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధుసూదన్ మండిపడ్డారు. ఆ రైతు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తి అని మాట్లాడటం విడ్డూరంగా ఉందని, రైతు ప్రభాకర్ స్వయంగా తాను కాంగ్రెస్‌కు ఓటేశానని చెప్పారని అది కోదండరెడ్డికి వినిపించలేదా అని ప్రశ్నించారు. తెలంగాణభవన్‌లో గురువారం తాతా మధుసూదన్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ రైతు ప్రభాకర్ ఆత్మహత్య కేసులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అనుచరుడు ప్రధాన నిందితుడని, ఆయనను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని నిలదీశారు. మొదటి నిందితుడుగా ఉన్న భట్టి అనుచరుడిని 8వ నిందితుడుగా ఎలా మార్చుతారని ప్రశ్నించారు. అతను భట్టికి చాలా దగ్గరి వ్యక్తి అని, జడ్పీటీసీ భర్త కూడా అని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడు ఎక్కడ చూసినా రైతుల ఆత్మహత్యలు తప్ప ఇంకోటి కనిపించడం లేదని, రాష్ట్రంలో ప్రజావాణికి వెళ్లి మరీ ఆత్మహత్య చేసుకునే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. మహబూబ్‌నగర్‌లో నిన్న ఒకరు ప్రజావాణికి వెళ్లి ఆత్మహత్యకు ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకున్నారని చెప్పారు. ప్రథమ ముద్దాయిగా ఉన్న కిశోర్‌పై కేస్ నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని, రైతు ప్రభాకర్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, రైతు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులను వెంటనే అక్కడ నుంచి బదిలీ చేయాలని డిమాండ్‌చేశారు. పాలనను గాలికి వదిలేసి సీఎం, మంత్రులు ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని దుయ్యబట్టారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందడం లేదని, వర్షాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కేసీఆర్ పాలనలో జూన్‌లోనే రైతుబంధు పడేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో జూలై వచ్చినా దిక్కులేదని విమర్శించారు.

చావుబతుకుల్లో మరోరైతు

మొదటిపేజీ తరువాయి...

కొనసాగుతున్నది.ఇదే గ్రామానికి చెందిన పచ్చిపాల భద్రయ్య, సోమయ్య, రామయ్య, మల్లయ్య అన్నదమ్ములు. వీరిలో భద్రయ్యది మినహా మిగతావారి వాటా భూమిని ఆర్టీఐ మాజీ కమిషనర్ శంకర్‌నాయక్ కుటుంబ సభ్యులు కొనుగోలు చేశారు. అధికారుల అండదండలతో సర్వేనంబర్లకు బై నంబర్లు వేసి పక్కనే ఉన్న భద్రయ్యకు చెందిన 1.20 ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్టు శంకర్‌నాయక్ పత్రాలు సృష్టించారని, బాధిత కుటుంబం ఆరోపిస్తున్నది. ఈ భూమి వివాదంపై ఇరువర్గాలూ కోర్టును ఆశ్రయించి ఇంజంక్షన్ ఆర్డర్లు కూడా తెచ్చుకున్నాయి. గురువారం భద్రయ్యకు చెందిన భూమిని శంకర్‌నాయక్ మనుషులు ట్రాక్టర్లతో దున్నుతుండగా భద్రయ్య, అతడి భార్య భాగ్యమ్మ అడ్డుకున్నారు. తమకు ఇంజంక్షన్ ఆర్డర్ ఉందని చెప్పారు. శంకర్‌నాయక్ మనుషులు భూమిని దున్న